ఫిర్యాదులపై స్పందించాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో అధికారులు స్పందించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం అధికారులతో కలిసి అబ్రహర్‌నగర్, పార్కువిల్లా కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వీధి దీపాలు వెలగకపోవడం, మంచినీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ జాలీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అబ్రహర్‌నగర్‌లో నిండిపోయిన డ్రైనేజీలలో పూడిక తీయించి సమస్యలను పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు జరిగింది. అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గొందళి సమాజ్ సంఘాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

ఆల్విన్‌కాలనీ: గొందళి సమాజ్ సంఘాన్ని బీసీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్‌నాథ్ దుస్గే అన్నారు. ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గొందళి సమాజ్ సంఘం పడుతున్న ఇబ్బందులను గొందళి సంఘం కళాకారులతో చూపించారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ దుస్గే మాట్లాడుతూ.. తమ పిల్లలు ఇప్పుడిప్పుడే పై చదువులు చదువుతున్నారని, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గొందళి సమాజ సంఘంను బీసీ జాబితాలో చేర్చడం వల్ల వారికి కుల ధృవీకరణ పత్రం, కుల సంఘ భవనం, తదితర సరిఫికెట్లు ప్రభుత్వం నుంచి అందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ విన్నపాన్ని దృష్టిలో ఉంచుకొని తమ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరారు.

చెరువు సుందరీకరణ పూర్తి చేయాలి

- ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి/మోతీనగర్: కాముని చెరువు సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించి బాలాజీనగర్ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైతే హౌసింగ్‌బోర్డు స్థలాన్ని సేకరించి అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులపై నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రంగధాముని చెరువు వద్ద ఆ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రూ.19 కోట్ల నిధులతో సుందరీకరణ పనులు చేపట్టామని, ఇందులో భాగంగానే ఇప్పటికే అత్యంత సుందరంగా కొంత ప్రాంతాన్ని తీర్చిదిద్దామన్నారు. మిగిలిన అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం వివేక్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను సంబంధిత అధికారులకు అందజేశారు. శక్తినగర్, హబీబ్‌నగర్, రోడ్డు నెంబర్ 1 వద్ద త్వరలో డ్రైనేజీ సమస్య పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సేవాలాల్ నగర్‌లోని సీసీ రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలాజీనగర్‌లో నూతన ధోబీఘాట్ కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహాబేగం, శిరీష, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆయా కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్, గాంధీ నగర్‌లోని డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలను శుక్రవారం పరిశీలించారు. గాంధీ నగర్ కాలనీ వద్ద డ్రైనేజీ పూడుకుపోయి నిండిపోవటంతో జీహెచ్‌ఎంసీ ఎయిర్‌టెక్ యంత్రం సహాయంతో పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఉదయం వచ్చే రిక్షా కార్మికులకు అందజేయాలని కోరారు. చెత్తను నాలాల్లో, రోడ్ల మీద, చెరువుల్లో వేయవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, సీహెచ్. భాస్కర్, పోశెట్టి గౌడ్, మల్లేష్, ప్రభాకర్, సదానంద్ గౌడ్, నరసింహులు, నాగేశ్వరరావు, నాగేశ్వర్ నాయక్, సూపర్ వైజర్ శివ పాల్గొన్నారు.



గాంధీ నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

యోగం.. ఆరోగ్య పాఠం

యోగాతో పదిమందికి మేలు చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి

ఆల్విన్‌కాలనీ: ఆయనో రిటైర్డు ఉద్యోగి. చాలా కాలం పాటు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. రిటైర్డు అనంతరం ఒంటరి లోకాల్లో, ప్రశాంతత పేరుతో విశ్రాంతి తీసుకోవాలనుకోలేదు. తనకు తెలిసిన యోగా విద్య ద్వారా పదిమందికి మేలు చేయాలనుకున్నారు. స్థానికులకు ఉచితంగా యోగాసనాలు నేర్పిస్తూ యోగా గురువుగా అందరి మన్ననలు అందుకుంటున్నారు. స్థానికంగా ఉండే సాంబశివారెడ్డి ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 20 ఏళ్ల నుంచి ఆయన నిత్యం యోగాసనాలు చేస్తున్నారు. రిటైర్డ్ తర్వాత కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో కాలనీ సొసైటీ భవనంలో వివేకానంద యోగా కేంద్రాన్ని 2000లో స్థాపించారు. మొదట్లో రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రమే యోగా నేర్పించేవారు. రాను రాను ఈ కేంద్రానికి జనాధరణ పెరిగింది. అధిక సంఖ్యలో వస్తున్న ఔత్సాహికులకు నాలుగు బ్యాచ్‌లుగా మహిళలు, పురుషులకు వేరు వేరుగా సాంబశివారెడ్డి శిక్షణ ఇస్తున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా యోగా నేర్చుకుని ఉల్లాసంగా ఉంటున్నామని ఇక్కడ శిక్షణ పొందుతున్న వారంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



యోగాసనాల సమయాలు

ఉదయం 5 నుంచి 6.15 వరకు మొదటి బ్యాచ్, 6.30 నుంచి 7.30 గంటల వరకు రెండవ బ్యాచ్ పురుషులకు, మహిళలకు వేరు వేరుగా తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు మహిళలకు మాత్రమే యోగా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నారు.

అనాథాశ్రమానికి రూ.లక్ష విరాళం అందజేసిన బండి రమేష్

కూకట్‌పల్లి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి చేయగలిగినంత కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. మూసాపేట, హెచ్‌పీ రోడ్డులోని సాయి సేవా సంఘం ఆహ్వానం మేరకు అనాథ పిల్లల ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రదీప్, అరుణ, సుశీల, లక్ష్మయ్య, శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తిరంగా ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: పహల్గాం ఉగ్రదాడికి భారతదేశ త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ నిర్వహించి ఎంతోమంది ఉగ్రవాదులను అంతమొందించింది. ఈ సందర్భంగా ఆల్విన్‌కాలనీ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల నిర్వాహకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.వంశీరెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రేవన్ రాజు, వేణు, డివిజన్ కోశాధికారి సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మూసాపేట: వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్టు చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించనూడ గ్రామానికి చెందిన కొప్పినీడు శ్రీరామాంజనేయులు(రాము) మూసాపేటలోని హబీబ్‌నగర్‌లో నివాసం ఉంటూ కారు యజమానిగా, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఆంజనేయనగర్‌లో కొబ్బరికాయల వ్యాపారం కూడా ఉంది. ఈ షాపులో షాపూర్‌నగర్‌కు చెందిన సాయి పనిచేస్తున్నాడు. గంజాయి విక్రయిస్తే డబ్బు బాగా సంపాదించవచ్చని యజమానికి సాయి చెప్పాడు. ఒకసారి గంజాయి విక్రయించగా లాభసాటిగా ఉండటంతో మరోమారు ఇద్దరు కలిసి వైజాగ్‌లో 4 కిలోల డ్రై గంజాయిని, 460 గ్రాముల హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేశారు. గురువారం సాయంత్రం ఐడీఎల్ చెరువు కట్ట మీదు రామును పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సాయి, పెడ్లర్ సురేష్ పరారీలో ఉన్నారు. మరో ఘటనలో.. జగద్గిరిగుట్టలో నివాసం ఉండే ఎస్‌కె హాజీ బాబా అలియాస్ జునైద్ (35) కారు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఎస్‌కే మహ్మద్ (35) జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ ప్లంబర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. 16న మహారాష్ట్రలోని పర్లి గ్రామంలో 750 గ్రాములు డ్రై గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు వచ్చారు. 19న కైత్లాపూర్‌లోని ఖాళీ స్థలంలో గంజాయి తాగుతుండగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. 596 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం

మూసాపేట: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలు అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే, భూ యజమానురాలు కాట్రగడ్డ ప్రసూన అన్నారు. శుక్రవారం కైత్లాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని భూ పత్రాలను చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 988 సర్వే నంబర్‌లో 38 గుంటలు తనకు, మరో వ్యక్తికి సంబంధించినదని తెలిపారు. 991లో 51 గుంటలు వారసత్వంగా వచ్చిన భూమి అని అన్నారు. 2004 నుంచి అనుమతులు తీసుకున్నామని, 2014లోనే డెవలప్‌మెంట్‌కు ఇచ్చామని తెలిపారు. తమ స్థలానికి గతంలోనే బండ్ల బాట ఉండేదని ఆమె వివరించారు. ఎమ్మెల్యే చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఈ భూమికి సంబంధించి, డెవలప్‌మెంట్‌కు తీసుకున్న అనుమతి పత్రాలు తమ వద్ద ఉన్నాయని వివరించారు.